క్లుప్తంగా

సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని అన్నపూర్ణ అనాథ ఆశ్రమానికి సూర్యపోగుల గిడ్డయ్య, చాందిని సహకారంతో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వలీబాషా, రాజు మాట్లాడుతూ అనాథలకు ప్రతిఒక్కరూ అండగా నిలిచి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మహేష్, మాధవరెడ్డి, రాజు పాల్గొన్నారు.

యత్తపు కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన యత్తపు కుటుంబాన్ని సోమవారం బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు యత్తపు వెంకటసుబ్బారెడ్డి తల్లి వెంకటలక్ష్మమ్మ(84) అనారోగ్యంతో మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేతోపాటు మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథ రెడ్డి, యత్తపు చంద్రశేఖర్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి ఆ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పేదలకు గ్రామ స్థాయిలో వైద్య సేవలు అందించడానికి ఫ్యామిలీ డాక్టర్ సేవలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గోరుమానుకొండ గ్రామంలో వైద్యురాలు మౌనిక, సూపర్‌వైజర్ శారద ఆధ్వర్యంలో గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మంగ్లీబాయి, పుష్పారాణి, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

21 నుంచి సామూహిక పారాయణం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో ఈనెల 21 నుంచి జూన్ 30వ తేదీ వరకు 41 రోజుల పాటు విష్ణు సహస్రనామ సోత్ర అఖండ మండల సామూహిక పారాయణం నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు గుండా గోపాలు, ఈశ్వర్ ప్రసాద్, గౌరి హుసేన్‌రెడ్డి, రామకృష్ణ, నాగమోహన్, డాక్టర్ నరసింహులు తెలిపారు. లోక కల్యాణం కోసం నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

మూడు ద్విచక్ర వాహనాలు అపహరణ

కోవెలకుంట్ల: పట్టణంలో వివిధ చోట్ల పార్కు చేసిన మూడు ద్విచక్ర వాహనాలు ఆదివారం అర్ధరాత్రి అపహరణకు గురి అయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. పెట్రోల్‌బంకు, ఆర్టీసీ బస్టాండ్ సమీపాల్లో ముగ్గురు వ్యక్తులు బైక్‌లు పార్కు చేసి వివిధ పనుల నిమిత్తం వెళ్లి తిరిగి రాగా ఆయా ప్రాంతాల్లో బైక్‌లు కన్పించకపోవడంతో బాధితులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. బైక్‌ల అపహరణపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

డోన్ టౌన్: నిరుద్యోగ యువతకు కడప పట్టణంలో కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా పాసైనా, ఫెయిలైనా ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. 18 నుంచి 26 ఏళ్ల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 35 రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచిత భోజనం, వసతి కూడా ఉంటుందన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 90004 87423 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విజయవాడకు తరలిన భక్తులు

బనగానపల్లెరూరల్: ప్రజాశ్రేయస్సు కోసం ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 12 నుంచి విజయవాడలో నిర్వహిస్తున్న హోమంలో పాల్గొనేందుకు మండలంలో నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. యాగంటి క్షేత్రం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, నందవరం ఆలయ ఈఓ రామానుజన్‌ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రిప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు.

పచ్చి రొట్ట పైరుతో భూసారం

- పుష్కలంగా పోషకాలు
- అధిక దిగుబడులకు ఆస్కారం



సాగవుతున్న పచ్చి రొట్ట పైరు

బేతంచెర్ల: రబీసాగు అనంతరం పొలాల్లో పచ్చి రొట్ట పైరులను పెంచడం వలన భూసారాన్ని పెంచుకొని తద్వారా రసాయన ఎరువులను తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ సూచిస్తున్నారు. అధికంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోతుందని, కట్టె జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలిలు వంటి పచ్చి రొట్ట పైర్లను పూత దశ వరకు భూమిలో పెంచి కలియదున్నితే భూమి సారవంతమై అధిక దిగుబడులు సాధ్యమవుతాయని చెప్పారు. రైతుల కోసం ఆయన చెప్పిన మరిన్ని వివరాలు..

సమపాళ్లలో పోషకాలు..

పచ్చి రొట్ట పైర్లలో నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకు, భాస్వరం 0.1 శాతం నుంచి 3.5 శాతం వరకు, పొటాషియం 0.5 శాతం నుంచి 2.0 శాతం వరకు ఉంటాయి. పంట ఎదుగుదల, దిగుబడికి ఈ మూడు పోషకాలు ఉండటం వల్ల రసాయన ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం ఉండదు. 30 శాతం వరకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. రసాయన ఎరువుల కన్నా పచ్చి రొట్ట ఎరువులు ఎంతో మేలు.

పచ్చి రొట్ట ఎరువుల వలన ఎన్నో లాభాలు

పచ్చి రొట్ట పైరు ఎరువు వల్ల అనేక లాభాలు ఉన్నాయి. సేంద్రియ పదార్థాలు పెరిగి, తద్వార అన్ని రకాల నేలలకు రసాయన, జీవ సంబంధిత లక్షణాలు మెరుగుపడతాయి. నేలలో ఆరోగ్య వంతమైన ఉత్పాదకత పెరుగుతుంది. ఎకరానికి 50 కిలోల వరకు నత్రజని అందుతుంది. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయం గా పెరుగుతుంది. అందువల్ల రైతులందరూ పచ్చి రొట్ట పైర్లను వేసవి ప్రారంభంలో సాగుచేయడం మంచిదని ఏఓ కిరణ్ కుమార్ సూచించారు.



ఏఓ కిరణ్ కుమార్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామం రైతు భరోసా కేంద్రంలో సోమవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ బండి వరలక్ష్మి, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బండి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలనేదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా రైతు భరోసా కేంద్రాల్లోనే పంటలను విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మేనేజర్ శంకర్, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు యామ పుల్లారెడ్డి, ఎస్ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, సర్వేపల్లి శివారెడ్డి, బండి రామచంద్రారెడ్డి, శివప్రసాదరెడ్డి రైతులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: రెండో వార్డులో వీధిలైట్లు, సీసీ రోడ్లు నిర్మించి, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎరుకల హక్కుల పోరాట సమితి జాలా కార్యదర్శి మోటా రాముడు, మండల కార్యదర్శి రామయ్యలు సోమవారం కమిషనర్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉండే ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఎరుకల పోరాట సమితి నాయకులు మద్దిలేటి, నాగరాజుతో పాటు రెండవ వార్డు కాలనీ మహిళలు ఉన్నారు.

షుగర్ లెస్ వరికి గిట్టుబాటు ధర



పంటకల్లాల్లో వరి ధాన్యం

బనగానపల్లె: రబీలో రైతులు పండించిన షుగర్ లెస్ వరికి గిట్టుబాటు ధర లభించినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరికి గిట్టుబాటు ధర లభించడంతో పాటు అధిక దిగుబడులు రావడంతో రబీ సీజన్‌లోనూ ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 26 వేల ఎకరాల్లో వరి సాగైనట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. గత నెల చివరిలో కురిసిన వర్షాలు, వడగండ్ల వాన వల్ల వరి పంటకు సుమారు 40 శాతం నష్టం వాటిల్లింది. అయినా 75 కిలోల వరిబస్తా రూ.1450–1500లతో వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో నష్టాల నుంచి ఉపశమనం పొందుతున్నారు. రైతు పక్షపాతిగా పేరుగాంచిన ఈ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే గిట్టుబాటు ధర లభిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

రామన్న ఆశయ సాధనకు కృషి



రామన్న చిత్ర పటానికి జోహార్లు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్: భూపోరాట యోధుడు కామ్రెడ్ నక్కి రామన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు కోరారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో సోమవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామాంజనేయులు మాట్లాడుతూ భూస్వామ్య పెత్తందార్లకు వ్యతిరేకంగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రామ న్న నిరంతరం ఉద్యమాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సొంటి పులిశేఖ ర్, నారాయణ, మోటా రాముడు, సుగుణమ్మ, ప్రభాకర్, అబ్బాస్, బాషా తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ పోల్స్ ఏర్పాటు



సిమెంట్ పోల్స్ ఏర్పాటును పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజేష్

డోన్: పట్టణంలో ప్రమాదకరంగా మారిన ఐరన్ పోల్‌లను గుర్తించి వాటిస్థానంలో సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. 11వ వార్డులో జరుగుతున్న సిమెంట్ పోల్స్ ఏర్పాటు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. చైర్మన్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు సతీష్, లైన్‌మెన్ సుబ్బయ్య, కాంట్రాక్టర్ మల్లికార్జున ఉన్నారు.

చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఆర్ఎస్ రంగాపురం జెడ్పీహెచ్ పాఠశాలకు దాతలు ఇచ్చిన డెస్కులను అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబభక్రుద్దీన్ కోరారు. అపహరణకు గురైన డెస్కుల పై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ జెడ్పీహెచ్ పాఠశాలకు మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి రూ.2లక్షలు వెచ్చించి వంద డెస్కులు విరాళంగా అందజేశారని గుర్తుచేశారు. ఇటీవల పాఠశాలకు కొత్తగా వచ్చిన హెచ్ఎం డెస్కులు బాగా లేవంటూ, ఎవరి అనుమతి తీసుకోకుండా ప్రైవేటు పాఠశాలలకు అమ్మడం దారుణమన్నారు. నాయకులు ప్రసాదు, సుబ్బరాయుడు ఉన్నారు.

ఆర్థిక పరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

నంద్యాల(అర్బన్): సామాజిక వెనుకబాటుతనాన్ని పోగొట్టడానికి భారత రాజ్యాంగ రచయితలు రిజర్వేషన్లు ఏర్పాటు చేశారని, రిజర్వేషన్లకు ఆర్థికతను ముడిపెట్టడం సరికాదని ప్రముఖ రచయిత, అనువాదకులు సిద్ధార్థ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఈడబ్ల్యూఎస్- రిజర్వేషన్లను అంతం చేసే కుట్ర అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దళిత మేధావుల ఫోరం నాయకులు నాదస్వరం నరసింహ, సుజిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధార్థ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉండాలని, అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లు కేటాయించటం కోర్టు తీర్పుకు విరుద్ధమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధికారులు భూషణం, కృష్ణయ్య, న్యాయవాది బాలస్వామి, మేకల లింగస్వామి పాల్గొన్నారు.

వరకట్న వేధింపులు

- ముగ్గురిపై కేసు నమోదు

కోవెలకుంట్ల: ప్రేమ వివాహం చేసుకుని ఏడాది తిరక్కముందే కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండటంతో బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన రామసుబ్బయ్య కుమార్తె ప్రసన్న, పాణ్యం మండలం తొగడ్చేడు గ్రామానికి చెందిన తిరుపాలు ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని నెలల పాటు వారి సంసార జీవితం సజావుగా సాగింది. ఇటీవలకాలం నుంచి కట్నం తేవాలని భర్తతో పాటు అత్త ఓలమ్మ, బావ వెంకటరమణ మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారి వేధింపులు తాళలేక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాధితురాలి భర్త, అత్త, బావపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి

అవుకు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. సోమవారం కునుకుంట్ల గ్రామంలో 85 మంది సాధారణ వ్యాధి గ్రస్తులకు, 14 మంది గర్భిణులకు, ముగ్గురు బాలింతలకు, 18 మంది రక్తపోటు ఉన్నవారికి, ముగ్గురు మంచానికి పరిమితమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

నాణ్యమైన విత్తనాలు అందజేయాలి

కోవెలకుంట్ల: త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులకు నాణ్యమైన విత్తనా లు అందజేయాలని మండల వ్యవసాయాధి కారి నిరంజన్ సూచించారు. సోమవారం స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, ఇన్వాయిస్, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, స్టాక్ బ్యాలెన్స్ తదితర రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు పొందిన రైతు లు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలన్నారు. కల్తీ విత్తనాలు, అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

కోలుకోలేక మహిళ మృతి

ప్యాపిలి: పట్టణంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న లక్ష్మీదేవి (38) కర్నూలులో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మీదేవి భర్త వెంకటరాముడు పొలం, శ్రీకాంత్ అనే వ్యక్తి పొలం పక్కపక్కనే ఉన్నాయి. పొలం విషయంలో తరచూ లక్ష్మీదేవి, శ్రీకాంత్ భార్య సువర్ణకు మధ్య గొడవలు జరిగేవి. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీదేవి ఆదివారం విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందింది. మృతురాలికి కుమార్తె ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

వయోవృద్ధులకు ఆర్డీఓ భరోసా

డోన్: తమ పెద్ద కుమారుడు రవిశకంర్ రెడ్డి ఆస్తి రాయించుకుని తమ ఆలనాపాలనా చూసుకోకుండా ఇంటి నుంచి బయటకు గెంటివేశాడని శ్రీరాం నగర్‌కు చెందిన వృద్ధ దంపతులు గంగిరెడ్డి(80), సుబ్బలక్ష్మమ్మ(76) సోమవారం స్పందనలో ఆర్డీఓ వెంకటరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీఓ మాట్లాడుతూ వృద్ధ దంపతుల పోషణ నిమిత్తం నెలనెల రూ.10 వేల చొప్పున భరణం చెల్లించేలా కుమారులు రవిశంకర్ రెడ్డి, భగీరథరెడ్డిలకు నోటీసులు జారీ చేస్తామన్నారు. సంతానం లేని వారి ఆస్తులను బంధువులు కాజేసి అవసాన దశలో పట్టించుకోకపోతే వారి ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, అలాగే ఆస్తి రాయించుకున్న బంధువులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

చలో డోన్‌ను విజయవంతం చేయండి

డోన్ టౌన్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 18న తలపెట్టిన హలో మాదిగ చలో డోన్ కార్యక్రమాన్ని దళితులు, దళిత సంఘాల నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ జాతీయ అధికార ప్రతినిధి, మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ కోరారు. చలో డోన్ మహా సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా సభకు ఎమ్మార్పీస్ వ్యవస్థాప అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారన్నారు.

మంత్రి చొరవతోనే అభివృద్ధి పనులు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్యాపిలి: ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతోనే డోన్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. డోన్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక టీములుగా ఏర్పాటైనట్లు చెప్పారు. వీరు అభివృద్ధి కార్యక్రమాల బ్రోచర్‌ను, ఆర్థికమంత్రి ప్రజలకు రాసిన లేఖను గ్రామాల్లో ప్రజలకు చేరవేస్తారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు అలేబాదు బాలయ్య, బోరెడ్డి రాము, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోపాలనగరం, రామరత్నగిరి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, వ్యవసాయాధికారి షేక్షావలి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ క్యాలెండర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సుంకేసుల గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. అంతర్గత రోడ్లు, వీధిస్తంభాల సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రధాన రహదారిలో ఓ వికలాంగుడు ఎమ్మెల్యేకు కనిపించగా పెన్షన్ వస్తుందా అని ఆరా తీయగా వస్తుందని చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. ట్రైసైకిల్ పూర్తిగా పాతపడిందని తెలుసుకుని త్వరలోనే బ్యాటరీ ఆపరేటర్ ట్రైసైకిల్ మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో వికలాంగుడు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలో రూ.2.75 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి, సర్పంచ్ కంభం ప్రభావతమ్మ, ఉపసర్పంచ్ కైప పార్థసారథిరెడ్డి, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తల్లం సుబ్రమణ్యం, నాయకులు ఎమ్మెల్యే తనయుడు కాటసాని ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: జలవిహారంలో ఇలా ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందటం బాధాకరమని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం గల్లంతైన యువతి మృతదేహం రిజర్వాయర్‌లో లభ్యమవటంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో పాటు అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న ముగ్గురు అకాల మరణం చెందటం ఆ కుటుంబానికి తీరని లోటు అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కుటుంబానికి అండగా ఉండేలా తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం మృతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తల్లం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. నడిమింటి నందీష్ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు ఏర్పాటు చేసిన శిబిరంలో మిత్రులు, బంధువులు పాల్గొని రక్తం దానం చేశారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాలల్లో, ప్రభుత్వ ఆసుపత్రిలో, అంధుల కాలనీ, లెప్రసీ కాలనీల్లో అన్నదానం చేశారు.

స్కూల్ బస్సుల తనిఖీ



ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను పత్రాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని ప్రైవేట్ సూళ్ల బస్సుల కండీషన్‌ను సోమవారం డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు రెన్యూవల్ చేసుకోవాలని యాజమాన్యా లకు సూచించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్లపై తిప్పితే భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు.

మహాకుంభాభిషేకోత్సవానికి ఆహ్వానం





మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మానప్రసాదరావును ఆహ్వానిస్తున్న ఈఓ, పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే మహాకుంభాభిషేక మహోత్సవానికి సోమవారం విజయవాడలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.జవహర్‌రెడ్డిని కలిసి ఈఓ ఎస్.లవన్న ఆహ్వానించారు. ఆయన వెంట స్వామివారి ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు పి.మార్కండేయస్వామి, సీనియర్ వేదపండితులు గంటి రాధాకృష్ణమూర్తి, అధ్యాపకులు ఎం.పూర్ణానందస్వామి ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రులు, ప్రధాన కార్యదర్శికి వేదాశీర్వచనంతో పాటు శేషవస్త్రాలు,ప్రసాదాలను అందజేశారు.

మహానందీశ్వరుడికి పల్లకోత్సవం

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లకు సోమవారం రాత్రి మహానందిలో పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు ఇచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ముక్కోటి దేవతలకు నిలయమైన గోమాతను అలంకరించి ఉత్సవం ముందు నడిపిస్తూ.. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.